కురవికి మహాశోభ

నేడు అంకురార్పణతో వీరన్న జాతర ఆరంభం





కురవి మహాశివరాత్రి జాతరకు సిద్ధమవుతున్న వీరభద్రస్వామి ఆలయం

- మొక్కులు చెల్లించుకోనున్న 10లక్షల మంది భక్తులు
- విద్యుత్ దీపాలతో వీరభద్రుని ఆలయం అలంకరణ
- శివరాత్రి పండుగకు ముస్తాబు

కురవి, మార్చి 6 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర తర్వాతి స్థానంలో పేరు గడించిన గిరిజనుల ఆరాధ్యదైవమైన కురవి వీరన్న జాతర గురువారం రాత్రి 7 గంటలకు అంకురార్పణతో ఆరంభమవుతుంది. మహా శివరాత్రి పర్వదినం ఈనెల 8 నుంచి నెల రోజుల పాటు కొనసాగుతుంది. వీరభద్రస్వామి జాతరలో రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి నెలరోజుల్లో దాదాపు 10 లక్షల మందిభక్తులు ఇక్కడకు వచ్చి మొక్కులు తీర్చుకుని వెళ్తారు. మహాశివరాత్రి జాతరకు ముందే కురవి ఆలయం జాతర శోభను సంతరించుకుంది. జాతరకు ముందే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వస్తుండటంతో భక్తులతో ఆలయం కిటకిటలాడుతోంది. జాతర కోసం ఇప్పటికే అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. కురవి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆలయం విద్యుత్ కాంతుల మధ్య ధగధగలాడుతోంది. ఆలయ పరిసరాలు మొత్తంగా పరిశుభ్రంగా తయారయ్యాయి. వీరభద్రుని కల్యాణం జరిగే నాగేంద్రస్వామి ఆలయ పరిసరాలను ఇప్పటికే శుభ్రం చేశారు. కల్యాణ మండపాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో చలువపందిళ్లు, కలకత్తా డెకరేషన్ టెంట్లు వేశారు. మొత్తానికి కురవి దేవాలయం మహా శివరాత్రికి ముస్తాబైంది. ఆలయ ఈవో సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎస్సై గోపి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి ఇతర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మరోమారు మేడిగడ్డకు ఎన్‌డీఎస్‌ఏ బృందం

- కుంగిన తర్వాత రెండోసారి డ్యామ్‌సేఫ్టీ అథారిటీ బృందం రాక
- ఉదయం మేడిగడ్డ, మధ్యాహ్నం అన్నారం బ్యారేజీల పరిశీలన
- ప్రాజెక్టు లోపాలు, పునరుద్ధరణ అవకాశాలపై అధ్యయనం
- కీలకం కానున్న సిఫారసులు



భూపాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం మరోసారి సందర్శించనుంది. ఈ ప్రాజెక్టులోని పలు పిల్లర్లు కుంగిన తర్వాత రెండోసారి ఇక్కడకు వస్తున్న బృందం కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల లోపాలు మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసే అవకాశం ఉంది. ఉదయం భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్, మధ్యాహ్నం అన్నారం సరస్వతి బ్యారేజీలను జాతీయ ఆనకట్టల భద్రత విభాగం నిపుణులు పరిశీలించనున్నారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకులో పిల్లర్ నెంబర్ 19, 20, 21 కుంగిన విషయం తెలిసిందే. దీంతో మేడిగడ్డ బ్యారేజ్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై రాజకీయంగా ప్రస్తుతం పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసి సిఫారసులు చేయాలని కోరడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నిపుణుల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో ఎన్‌డిఎస్‌ఏ నిపుణుల బృందం ఒక దఫా ప్రాజెక్టును సందర్శించి వెళ్లింది. ఈ పరిణామాల క్రమంలో ప్రభుత్వం మారడం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం రాజకీయ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇటీవలే అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్షమైన బీఆర్‌ఎస్ నేతలు పోటాపోటీగా ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాలు చేపట్టి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలకు ప్రాజెక్టును అస్త్రంగా వాడుకుంటోందంటూ బీఆర్‌ఎస్ ఎదురుదాడికి దిగడంతో ప్రభుత్వం వీలైనంత తొందరగా ఈ రెండు ప్రాజెక్టుల భవితవ్యాన్ని తేల్చాలంటూ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాయడంతో ప్రస్తుతం నిపుణుల కమిటీ అధ్యయనానికి శ్రీకారం చుట్టింది..

బృందం పర్యటన సాగనుందిలా..

కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీలను అధ్యయనం చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం గురువారం రోజంతా మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులను సుదీర్ఘంగా అధ్యయనం చేయనుంది. ఉదయం 9గంటలకు ఎన్‌డీఎస్‌ఏ బృందం మేడిగడ్డ చేరుకొని అల్పాహారం తర్వాత 9.30గంటలకు బ్యారేజీ తనిఖీల ప్రక్రియ ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు దెబ్బతిన్న పిల్లర్లు, డిజైన్లలోపాలు, నిర్మాణ నాణ్యత, మరమ్మతులకు గల అవకాశాలు లాంటి అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేస్తుంది.

మధ్యాహ్నం ఒకటిన్నరకు మేడిగడ్డ వద్ద భోజనం ముగించుకుని రెండున్నర గంటలకు అన్నారం సరస్వతి బ్యారేజ్ వద్దకు చేరు కుంటుంది. మధ్యాహ్నం 3.15 నుండి సాయంత్రం ఆరున్నర గంటల వరకు సరస్వతి బ్యారేజ్‌ని పరిశీలించి నేరుగా రామగుండం వెళుతుంది. ఆ మరు సటి రోజు సుందిళ్ల బ్యారేజ్‌ని తనిఖీ చేయనున్నారు.

నిపుణుల కమిటీ సిఫారసులే కీలకం

దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీల భవితవ్యాన్ని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల బృందం ఇచ్చే నివేదికలే తేల్చనున్నాయి. నిపుణుల కమిటీ ప్రధానంగా 19 అంశాలపై సమాచారం అడిగినందున తనిఖీలలో వాటిపైనే ప్రధానంగా ఫోకస్ పెట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రాజెక్టు డిజైన్ మొదలు క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ లాంటి అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. దెబ్బతిన్న ఏడో బ్లాకులోని పిల్లర్ల మరమ్మతులకు ఏ మేరకు అవకాశాలు ఉన్నాయి? మరమ్మతులు చేయిస్తే భవిష్యత్తులో ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుంది? దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో మళ్లీ పునర్నిర్మించాలా? వద్దా? అనే అంశాలను నిపుణులు తేల్చే అవకాశాలున్నాయి.

రైతు నేస్తంకు సీఎం శ్రీకారం

- వర్చువల్ పద్ధతిలో రేవంత్‌రెడ్డి ప్రారంభం
- వానాకాలం నుంచి పంటల బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రైతునేస్తం ప్రారంభిస్తున్న సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 6 : జిల్లా కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమాన్ని హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ పద్ధతిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు చేదోడు.. వాదోడుగా రైతు నేస్తం డిజిటల్ సేవల ద్వారా అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడ తాయని చెప్పారు. 26 రకాల పంటల బీమా సౌకర్యం వచ్చే వానాకాలం నుంచి కల్పించడం జరుగుతుందని, రైతు వాటా ధనం కింద ప్రీమియంను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల జరిగే పంటనష్టాలకు సకాలంలో పరిహారం అందుతుందని, నూతన టెక్నాలజీ ఆధారంగా సత్వరమే పరిహారం అందుతుందని చెప్పారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారులతో క్షేత్రస్థాయిలో సమస్యలపై రైతులతో చర్చించి వాటికి పరిష్కారం దిశగా సూచనలు ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ద్వారా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. రైతులు సీజనల్ వారీగా ఎప్పుడు ఏపంటలు వేయాలని, ఏ ఎరువులు వేయాలి, భూమి యొక్క సాంద్రత, పంటలకు సంబంధించిన పూర్తి వివరాలు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో సూచనలు అందుకోవచ్చని వివరించారు. రైతులు తమ అనుభవాలతో పాటు ఇతర రైతుల అనుభవాలను కూడా పంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రైతునేస్తం కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయని, ఈ వ్యవసాయ శాఖయే కాకుండా ఇతరశాఖల అధికారులు కూడా ఈ వీడియో కాన్ఫరెన్స్ ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యు, ఏడీఏ లక్ష్మీనారాయణ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన, విస్తీర్ణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మామిడికి.. తామర దెబ్బ



దంతాలపల్లిలో మామిడి తోటకు పురుగులమందు పిచికారీ చేస్తున్న దృశ్యం

- మాడిపోయి రాలుతున్న చెట్ల పూత
- తగ్గనున్న దిగుబడి, ఆందోళనలో రైతులు
- సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే నియంత్రణ
- జిల్లా వ్యాప్తంగా 16,470 ఎకరాల్లో తోటలు



నర్సింహులపట, మార్చి 6 : జిల్లాలోని మామిడి రైతులు దిగాలు చెందుతున్నారు. తోటలకు తామర పురుగు ఆశిస్తుండటంతో విలవిల్లాడుతున్నారు. చెట్లకు వచ్చిన పూత మాడిపోతోండటంతో పాటు రాలిపోతున్నది. నల్లతామర తీవ్రత వల్ల దిగుబడిపై మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. తామర పురుగు నివారణకు ఎన్నిరకాల పురుగు మందులు పిచికారి చేసినా ఫలితం లేకుండాపోతోంది.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 16,470 ఎకరాలల్లో మామిడి సాగు అవుతోంది. అత్యధికంగా కురవి మండలంలో మూడువేల ఎకరాలు, మరిపెడలో 2,800 ఎకరాలు, దంతాలపల్లిలో 2,100 ఎకరాలు, తొర్రూరులో 1,860 ఎకరాలు, నర్సింహులపేట మండలంలో 980 ఎకరాలతో పాటు ఇతర మండలాల్లో 5,730 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు.

ఇండోనేషియా నుంచి..

తామర పురుగు ఇండోనేషియా దేశం నుంచి మన భారత్‌లోకి విస్తరించింది. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ ప్రాంతంలో మిర్చిపంటపై ఆశించిన తామర పురుగును 2020 డిసెంబరు మాసంలో మన శాస్త్రవేత్తలు మొదటగా గుర్తించారు. 2021 ఫిబ్రవరి, మార్చి నెలవరకు గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వ్యాప్తి చెందింది. క్రమక్రమేనా తెలుగు రాష్ట్రాలల్లో విస్తరించి 90శాతం వరకు మిర్చి రైతులను కుదేలు చేసి రైతులను మిర్చి నష్టాలపాలు చేసింది.

13 రకాల పంటలపై తీవ్ర ప్రభావం..

తామర పురుగు జీవిత కాలం 27 రోజులు మాత్రమే. పిల్ల, తల్లిరకం పురుగులు పసుపు, తెలుపు రంగులో ఉన్న 13 రకాల పంటలపై తీవ్రప్రభావం చూపుతున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలుపుతన్నారు. దీనిలో ప్రధానంగా మిర్చి, మామిడి, జామ, బీర, దోస, బొబ్బరి, పెసర, వేరుశెనగ పంటలపై ప్రభావం ఉన్నట్లు నిర్ధారించారు.

నాడు మిర్చి.. నేడు మామిడిపై..

తెలుగు రాష్ట్రాలల్లో గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి తెలంగాణకు వ్యాప్తి చెందిన తామర పురుగు జిల్లాలో నాడు మిర్చి పంటపై వ్యాపించి రైతులను కుదేలు చేసింది. జిల్లా వ్యాప్తంగా 82 వేల 426 ఎకరాలల్లో మిర్చి పంటను ఆశించిన తామర పురుగు 96 శాతం మిర్చి పంటను నాశనం చేసింది. నేడు మామిడిపై పంజా విసరడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నిరకాల పురుగు మందులను పచ్చికారి చేసినా పలితం లేదు.

మామిడి దిగుబడులు అంతంతే..

తామర పురుగు తీవ్రతతో జిల్లాలో మామిడి దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గే ప్రమాదం ఉన్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2021 సంవత్సరంలో 40 వేల టన్నులు మామిడి దిగుబడులు వచ్చాయి. 2022-23 సంవత్సంరంలో మామిడి దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారుల అంచనా. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించకపోతే మామిడి ఆశించిన మేరకు దిగుబడులు ఉండకపోవచ్చని అటు శాస్త్రవేత్తలు, ఉద్యాన వనశాఖ అధికారులు తెలుపుతున్నారు.



సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

- సూర్యనారాయణ, డీహెచ్‌వో

మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే తామర పురుగు నుంచి రక్షించుకోవచ్చు. ఈ సీజన్‌లో తామర పురుగు మామిడిని ఆశిస్తుందన్నారు. నివారణ కోసం 10సంవత్సరాల వయస్సు దాటిన మామిడి చెట్టుకు మొదట్లో 2.50 కేజీల వేపపిండి వేసుకోవాలి. తోటలో ఎకరానికి 25 నుంచి 30బ్లూకలర్ అట్టాలను ఏర్పాటు చేసి, నిత్యం గమనించాలి, థయోమిథ్రాన్ మందును లీటరు నీటిలో 0.4 గ్రాముల మోతాదులో మామిడి పూతపై పిచికారి చేసుకోవాలి. ఇలాంటియాజమాన్య పద్ధతులతో కొంత వరకు తామరపురుగు తీవ్రతను అడ్డుకోవచ్చు.

నువ్వులు క్వింటాకు రూ.12 వేలు

కేసముద్రం, మార్చి 6 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో నువ్వులకు రికార్డుస్థాయిలో ధర నమోదైంది. బుధవారం ఓ రైతు ఒకబస్తా నువ్వులు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో క్వింటాకు రూ.12009 ధర నమోదు చేశారు. మంగళవారం ఒక బస్తా విక్రయానికి రాగా రూ.9,029 ధరకు కొనుగోలు చేశారు. నువ్వులకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8,635 ఉండగా అంతకంటే మించి రేటు నమోదు కావడం విశేషం.

బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

- కాంగ్రెస్‌లో చేరిన తొర్రూరు మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఇద్దరు కౌన్సిలర్లు

తొర్రూరు, మార్చి 6 : రానున్న పార్ల మెంట్ ఎన్నికలకు ముందు పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. తొర్రూరు మునిసిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, ఇద్దరు కౌన్సిలర్‌లు బుధవారం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో తొర్రూరులోని పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్‌లో చేర్చుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గంలో కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు. బీజేపీ తోనే పోటీ అని, పార్టీలో పాతకొత్త అని చూడకుండా ప్రతీ ఒక్కరు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాల ని కోరారు. కాంగ్రెస్ పార్టీలో మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, 10, 16వ వార్డు కౌన్సిలర్‌లు దొంగరి రేవతి శంకర్, బిజ్జాల మాధవి అనిల్ కాంగ్రెస్ పార్టీలో



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు

మిగతా 6వ పేజీలో

'ముక్క' ముట్టలేం.!

- భారీగా పెరిగిన బ్రాయిలర్ చికెన్ ధరలు
- లైవ్ కోడి కిలో రూ.180
- స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.300
- వేసవిలో ఉత్పత్తి తగ్గడంతో పెరిగిన రేట్లు



మహబూబాబాద్ టౌన్, మార్చి 6 : మార్కెట్‌లో ఇప్పటికే మటన్ ధరలు ఆకాశాన్నంటగా, చికెన్ రేట్లు చుక్కలు చూపిస్తున్నాయి. కోళ్ల ధరలు పైపైకి పెరిగి కొండెక్కి కూర్చున్నాయి. కిలో బ్రాయిలర్ కోడి ధర రూ.180 పలుకుతుండగా, స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.300, స్కిన్‌తో 280కి పెరగడంతో అది సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందకుండా పోయింది. మేడారం సమ్మక్క,సారలమ్మ జాతర, ఉప్పలమ్మ పండుగ, వివాహాది శుభకార్యాలయాల నేపథ్యంలో గొర్రెలు, మేకల ధరలు విపరీతంగా పెరిగిన విషయం విదితమే. గొర్రె, మేక ధర రూ.10 వేల నుంచి మొదలుకుని రూ.20 వేల వరకు పలుకుతోంది. గతంలో కిలో రూ.800కు విక్రయించగా ప్రస్తుతం అది రూ.1000కు చేరుకుంది. అదే దారిలో కోళ్ల ధరలు కూడా పయనిస్తున్నాయి.

చుక్కలు చూపిస్తున్న చికెన్..

మేడారం సమ్మక్క, సారలమ్మ, మినీమేడారం జాతర, తిరుగువారం పండుగలతో పాటు ఎండ వేడిమితో కోళ్లు చనిపోతున్నాయి. అలాగే ఉత్పత్తి తగ్గడం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ వస్తుందన్న వార్తలతో అక్కడి నుంచి తెలంగాణకు కోళ్లను దిగుమతి చేసుకోకపోవడం ఇక్కడ ఉత్పత్తి అయిన కోళ్ల సరిపోక పోవడంతో కోళ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో బాయిలర్ కోడి కిలో ధర రూ.120 నుంచి 130కి వరకు ఉండేది. ప్రస్తుతం అది రూ.170 నుంచి 180కి చేరుకుంది. స్కిన్‌తో చికెన్ కిలో రూ.220 నుంచి 240కు దొరికితే ఇప్పుడు రూ.280కి పెరిగింది. ఇక స్కిన్‌లెస్ చికెన్ గతంలో కిలో ధర రూ.240 నుంచి 260కి దొరికితే ప్రస్తుతం రూ.300కు పెరిగింది. రూ.5 ఉన్నకోడి గుడ్డు ధర ఏకంగా రూ.7కు చేరుకుంది. బాయిలర్ కోడి ధర పెరగడంతో ఇక నాటు కోడిని కొనుగోలు చేద్దామన్న వాటి ధరలను మందలించే పరిస్థితి లేదు. కిలో రూ.400 నుంచి 500 పలుకుతోంది. అవి కూడా గ్రామాల్లో తక్కువ సంఖ్యలో పెంచడంతో వాటికి డిమాండ్ పెరిగింది. వేసవిలో కాలంలో ఆరంభం మార్చి నెల ఆరంభంలోనే కోళ్ల ధరలు ఈ రకంగా ఉంటే ఇక మండు టెండలు, వడగాల్పులు వీచే ఏప్రిల్, మే నెలలో ఏవిధంగా ఉంటాయో ఊహించుకుంటేనే భయమేస్తోంది. ఏప్రిల్, మే మాసంలో కోళ్ల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

మేడారం ఆదాయం రూ.13.25కోట్లు

పూర్తయిన అన్నికానుకల లెక్కింపు.. ఏడు రోజుల కౌంటింగ్‌కు తెర

హనుమకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ద్వారా ఈ సారి మొత్తం రూ.13,25,22,511 కోట్ల ఆదాయం వచ్చిందని ఈవో రాజేంద్రం తెలిపారు. హుండీల లెక్కింపు మంగళవారమే పూర్తికాగా బుధవారం పసుపు, కుంకుమ, బెల్లంతో తడిసి ముద్దయిన నోట్లు, నాణాలను లెక్కించగా రూ.53,43,231గా తేలింది. ముద్దయిన నోట్లను సబ్బు నీళ్లలో నానబెట్టి శుభ్రం చేశారు. ఆరిన తర్వాత ఇస్త్రీ చేసి తిరిగి పూర్వరూపానికి తీసుకువచ్చారు. ఈసారి నాణాలు పెద్దమొత్తంలో వచ్చాయి. అయిదు పెద్ద నీళ్ల ప్లాస్టిక్ డమ్ములు నిండాయి. వీటిని డినామినేషన్ల ప్రకారం వేరు చేశారు. వాటిని బ్యాంకు అధికారుల సమక్షంలో తూకం వేసి లెక్కకట్టారు. నోట్లతో పాటు నాణాలను బ్యాంకులో జమ చేశారు. అన్నిటి లెక్కింపు పూర్తయినందువల్ల బుధవారంతో ఏడురోజుల పాటు సాగిన కౌంటింగ్‌కు తెరపడిందని సమ్మక్క సారలమ్మ జాతరు ఈవో రాజేంద్రం తెలిపారు.

ఫిబ్రవరి 29నుంచి హుండీలలెక్కింపు ప్రారంభమైంది. లెక్కింపులో మొత్తం 350 మంది దేవాదాయ, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. లెక్కింపులో పాల్గొన్నవారు డ్రెస్‌కోడ్ పాటించారు. లెక్కింపు సందర్భంగా ఎలాంటి అక్రమాలు, పొరపాట్లు జరగకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం చుట్టూరా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం లోపల, బయట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లెక్కించిన నగదును ఎప్పటికప్పుడు బ్యాంకులో జమచేశారు. నగదును, బంగారం, వెండి బంగారం కానుకలను చివర మదింపువేసి బ్యాంకులాకర్‌లో భద్రపరిచారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖల సహకారంతో సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీల లెక్కింపు ఏడు రోజుల పాటు ప్రశాంతవాతారణంలో నిర్వహించారు. ఈ సారి హుండీల్లోని నాణాలు, బంగారం, వెండి వస్తువులను జల్లెడ పట్టడానికి ప్రత్యేకంగా ఒక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల హుండీల లెక్కింపు వేగవంతగా జరిగింది. గతంలో హుండీల లెక్కింపు పూర్తయ్యేసరికి పది, పదకొండు రోజుల పట్టేది. ఈ సారి ఆరు రోజుల్లో పూర్తి చేశారు. బుధవారంతో మొత్తం 540 హుండీలను లెక్కించారు. నగదుతో పాటు హుండీల్లో భక్తులు వేసిన బంగరు, వెండి కానుకలను కూడా తూకం వేసి వాటి విలువను మదింపు వేశారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా


నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు

నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్‌హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగు నీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ' రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి ' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్టుగా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రజలపై భారం మోపేందుకే ఎల్‌ఆర్‌ఎస్

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు, మార్చి 6 : ప్రజలపై ఆర్థిక భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు చేసేందుకు సిద్ధం అయిందని, వెంటనే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును రద్దు చేయాలని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం తొర్రూరులోని బస్టాండ్‌సెంటర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు పార్టీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలు మాట మార్చారన్నారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.1000తో రిజిస్ట్రేషన్ చేస్తే కాంగ్రెస్ నాయకులు ఎల్‌ఆర్‌ఎస్ కట్టవద్దని కోర్టుకు వెళ్లి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పి ఇప్పుడు ప్రజల నుంచి వేలకోట్లు దండుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ కట్టాలని దరఖాస్తులు తీసుకోవడం సరికాదన్నారు. ఉచితం అనిచెప్పి రూ.20వేల కోట్లు వసూలు చేయడానికి సిద్ధపడ్డారని, మార్చి 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ కట్టి తీరాలని, ప్రజల మెడపై కత్తి పెట్టారని ప్రభుత్వం వెంటనే స్పందించి ఎల్‌ఆర్‌ఎస్ విధానాన్ని విరమించుకోవాలన్నారు.మండల అధ్యక్షుడు సీతారాములు,బిందు శ్రీను, జడ్పీటీసీ శ్రీనివాస్, ఎంపీపీ అంజయ్య, కాలునాయక్, బాలునాయక్, రమేష్, బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.


బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న దయాకర్‌రావు

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రదీప్‌రెడ్డి

బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డివిజన్ కేంద్రంలోని బీరప్ప నగర్‌కు చెందిన హనుమాండ్ల ప్రదీప్ రెడ్డి నియమితులయ్యారు. బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పార్టీ బలోపేతం కోసం అన్నివిధాల కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన మాజీ మంత్రి దయాకర్ రావుకు, బీఆర్‌ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు సీతారాములు, శ్రీనివాస రావు, కుర్ర శ్రీనివాస్, ప్రమోద్, కాలునాయక్, నాగరాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● సమీకృత వ్యవసాయ సాధనకు అధికారులు కృషి చేయాలి
● ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే రాంచంద్రునాయక్
● నర్సింహులపేటలో రైతునేస్తం ప్రారంభం

నర్సింహులపేట, మార్చి6 : రైతు సంక్షేమమే రాష్ట్రప్రభుత్వం ధ్యేయమని, తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సమీకృత వ్యవసాయ సాధనకు శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం నర్సింహులపేటలోని రైతు వేదికలో రైతు నేస్తంను ప్రారంభించారు. ప్రొజెక్టర్‌పై సమీకృత వ్యవసాయంపై పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2,602 రైతు వేదికలకు గాను 110 రైతు వేదికలను సమీకృత వ్యవసాయానికి ఎంపిక చేశారన్నారు. వీటిలో జిల్లాలో మహబూబాబాద్, నర్సింహులపేట రైతు వేదికలను ఎంపిక చేశారన్నారు. ఈరైతు వేదికల్లో ప్రొజెక్టర్ ద్వారా సమీకృత వ్యవసాయంపై రైతులకుసలహాలు, సూచనలు ఇస్తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రైతు నేస్తంను అధికారులు, శాస్త్రవేత్తలతో క్షేత్రస్థాయిలో అమలుకు కృషి చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ అవకాశం ఉన్నదని, మిగతా ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ వసతి ఉన్నదన్నారు. సమీకృత వ్యవసాయంతో రైతులకు పూర్తిస్థాయిలో మేలుజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మరియన్న, ఏడీఏ శోభన్‌బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శ్రీను, ఎస్సై సతీష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు దాసరోజు రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్రి లింగారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దస్రూనాయక్, రజినీకాంత్‌రెడ్డి, కడుదుల రామకృష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వివరాల కరపత్రాలను విడుదల చేస్తున్న రాంచంద్రునాయక్

ప్రజలను సమస్యల నుంచి విముక్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, మార్చి 6 : ప్రజలను సమస్యలను నుంచి విముక్తి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. గూడూరు మండలం తేజావత్‌రాంసింగ్ తండాలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసే సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం భూపతిపేటలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పత్రి వెంకటయ్య ఇళ్లు దగ్ధం కావడంతో వారిని పరామర్శించి ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో తొలి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. గాజులగట్టులో కల్లెపు యశోద అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో గ్రామాల్లో ఏమాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. గూడూరులో రహదారుల అభివృద్ధి కోసం రూ.3.30 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లికొండ మధు, మాజీ సర్పంచ్‌లు మంగీలాల్, రవిసింగ్ రాథోడ్, మాజీ ఎంపీటీసీ శంకర్, శ్రీనివాస్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయం'


తాళ్లపూసపల్లి హైస్కూల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, స్టేషనరీని పంపిణీ చేస్తున్న సమ్మిగౌడ్ ఫౌండేషన్ బాధ్యులు

కేసముద్రం, మార్చి 6 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయమని తాళ్లపూసపల్లి హైస్కూల్ హెచ్‌ఎం కోట కనకయ్య అన్నారు. మండలంలోని తాళ్లపూసపల్లి జడ్పీహైస్కూల్లో బుధవారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో 40 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.12 వేల విలువైన పరీక్షప్యాడ్‌లు, స్టేషనరీ వస్తువులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు దామరకొండ ప్రవీణ్‌కుమార్, సామల నర్సయ్య, నరేటి కొమురయ్య, రాచర్ల రాములు, కందుకూరి దాసు, వల్లాల రాజేందర్, శ్రవణ్, గొడిశాల వెంకన్న పాల్గొన్నారు.

బొడ్రాయి వార్షికోత్సవం

కేసముద్రం, మార్చి 6 : మండలంలోని కల్వలలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితులు ప్రదీప్ శాస్త్రి, ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, జలాభిషేకాలు, నవగ్రహ పూజ, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ముత్యాలమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి, లింగాల పిచ్చయ్య, పెరుమాండ్ల ఎల్లగౌడ్ కొండ్రెడ్డి యాకూబ్‌రెడ్డి, మాందాటి వెంకట్‌రెడ్డి, గంట బాలకృష్ణారెడ్డి, పులిగిల్ల గట్టయ్య పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడిగా మహేష్

గార్ల, మార్చి 6 : అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడిగా చెవుల మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజు యాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక వర్తక సంఘం భవనంలో సంఘం మండల మహాసభలో మహేష్ అధ్యక్షుడిగా నియమించి అతనితోపాటు మరో 20 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నసర్ల బాబురావు, పెద్దబోయిన రవియాదవ్, గజ్జి రామయ్యయాదవ్, పల్లెబోయిన లింగయ్యయాదవ్, తోడేటి రాజుయాదవ్, చల్లా వినయ్‌యాదవ్, దొడ్డ రామయ్యయాదవ్, మీగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలపై వినతి

బయ్యారం, మార్చి 6 : మండలంలోని పలు సాగునీటి సమస్యలపై ఇల్లందులో బుధవారం ఎమ్మెల్యే కోరెం కనకయ్యను సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ బయ్యారం పెద్దచెరువులో పూడిక తీయించాలని, మత్తడి ఎత్తును మూడు అడుగులు పెంచాలని, చెరువు కాల్వలకు సీసీ వేయించాలని కోరారు. వివిధ గ్రామాల్లోని కాల్వలను, చెక్‌డ్యాంలను నిర్మించాలని కోరారు. డీసీసీ కార్యదర్శి భూక్య ప్రవీణ్‌నాయక్, కొండపల్లి లక్ష్మి, వేల్పుల శ్రీనివాస్, బానోత్ మోహన్, గట్ల గణేష్, ప్రభాకర్‌రెడ్డి, రాకేష్, శ్రీను, భాస్కర్‌రావు, నర్సయ్య, మంగీలాల్, వెంకటేశ్వర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సంత వేలం పాట

నర్సింహులపేట, మార్చి 6 : మండల కేంద్రంలోని వారాంతపు సంత వేలంపాట నిర్వహించనున్నట్లు ఎంపీవో సోంలాల్ బుధవారం తెలిపారు. ఈనెల 7న వేలం పాటలో పాల్గొనే వారు ఉదయం 10 గంటలలోపు రూ.50 వేలు ధరావత్ చెల్లించాలని, వారే వేలం పాటలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

'కేంద్రప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

● వర్చువల్ పద్ధతితో ప్రధాని మోదీ అవగాహన

మహబూబాబాద్ రూరల్, మార్చి 6 : కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను మహిళ సంఘాల సభ్యులు, చేతివృత్తిదారులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రధాని మోదీ సూచించారు. 'నారీశక్తి అభియాన్' కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై పశ్చిమబెంగాల్ నుంచి బుధవారం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిలో అవగాహన కల్పించారు. మహిళ సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. చేతివృత్తిదారు లకు కేంద్రప్రభుత్వం వారివారి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి వారికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, యాప సీతయ్య, భాస్కర్ రెడ్డి, కొమ్మాల్‌రెడ్డి, సురేందర్, శ్రీను, సంపత్, మురళి, నాగమణి, దార ఇందుభారతి పాల్గొన్నారు.



కేంద్రప్రభుత్వ పథకాలపై ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ప్రధాని మోదీ

'మహనీయుల విగ్రహాలు నిత్యస్ఫూర్తికి చిహ్నాలు'

మహబూబాబాద్ రూరల్, మార్చి 6 : మహనీయుల విగ్రహాలు నిత్య స్ఫూర్తిగా చిహ్నాలని తెలంగాణ ప్రొగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు బలాష్టి రమేష్ అన్నారు. అమనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలను, దోపిడీ, పీడన, అణిచివేతలను, సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకుపోరాడిన మహనీయులు చరిత్రలో నిలిపోయారని చెప్పారు. అలాంటి త్యాగధనుల స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ నెల 10న జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని మహనీయురాలు సావిత్రిభాయిపూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. శశిధర్, భూక్య బాలాజీ, యుగేంధర్, రమేష్, అరుణ, హైమా పాల్గొన్నారు.

మన్నెగూడెం జడ్పీహెచ్ఎస్‌లో..

మానుకోటలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో 10న జరుపతలపెట్టిన సావిత్రిబాయిపూలే విగ్రహం ఆవిష్కరణ- మహిళా సదస్సును జయప్రదం చేయాలని సంఘం నాయకులు కొంపెల్లి రామయ్య విజ్ఞప్తి చేశారు. సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి విద్యాభిమానులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. సాయిబాబు, సాహెబ్ అలీ, శ్రీధర్, వినోద్‌కుమార్, మంజుభార్గవి, మహబూబ్, ఉప్పలయ్య, కపిల్ పాల్గొన్నారు.

ఎంపీగా తనకు అవకాశం కల్పించండి

● కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాయపురం సాంబయ్య


మాట్లాడుతున్న రాయపురం సాంబయ్య

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 : కాంగ్రెస్‌లో 30 సంవత్సరాలుగా పనిచేస్తూ పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న తనకు మానుకోట ఎంపీగా అవకాశం కల్పించాలని ఆ పార్టీ నాయకుడు, ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్న రాయపురం సాంబయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఇచ్చిన సోనియగాంధీ ఫ్లెక్సీ వద్ద మోకాళ్లపై కూర్చుని చేతులు జోడించి ఎంపీ టిక్కెట్ ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అంతా పర్యటిస్తూ ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లి ప్రచారం చేసి కాంగ్రెస్ గెలుపు కోసం తనవంతు కృషి చేశానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించినప్పటికి తనకు అవకాశం రాలేదని, ఎరుకల సామాజిక వర్గానికి ఎంపీ స్థానాన్ని కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే. అమీర్‌పాషా, షరీఫ్, వెలుగు శ్రీకాంత్, రాయపురం సంపత్, కట్ట పాపయ్య, రాగ మల్లయ్య, ఉంద్రాతి కరుణాకర్, రాజేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి'

డోర్నకల్, మార్చి 6 : రానున్న వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు మండల స్థాయి అధికారులను సమన్వయం చేసుకుని తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణవేణి అన్నారు. బుధవారం ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ ద్వార ప్రస్తుతం సరఫరా అయ్యే నీరు సరిపోవని, అందుకే ప్రజలు ఇబ్బందులు కలుగకుండా బోరుబావులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో మంచినీటి బావులను శుభ్రం చేయించి, తాగునీటి సరఫరాకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మున్వర్‌బేగ్, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా మేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


మేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

డోర్నకల్, మార్చి 6 : లింబియాతండా శివారు లచ్చతండా శ్రీరాంసింగ్‌బాబా (వేంకటేశ్వరస్వామి) మల్సూర్‌బాబా దర్గా ఆలయ ప్రాంగణంలో నూతనంగా శ్రీమేరమ్మతల్లి దేవాలయాన్ని నిర్మించి బుధవారంవిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మాన్‌సింగ్ బావోజీ, లచ్చు బావోజీలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి గొల్లచర్ల గ్రామపంచాయతీ పరిధి నుంచి భక్తులు తరలివచ్చారు. మాజీ ఎంపీటీసీ బాలునాయక్, ఆలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి లచ్చిరాం, బద్దు నాయక్‌లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పెద్దవంగర, మార్చి 6 : సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దవంగర మండల అధ్యక్షుడు ఏదునూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డి మంజుల దంపతుల సహకారంతో అల్పాహారం వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నవసమాజ నిర్మాణానికి లయన్స్ క్లబ్ సేవలు ఎంతో అవసరమన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, మల్లికార్జునాచారి, అనపురం రవి, సుభాష్, రేణుక పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆర్యవైశ్య సంఘం

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 : సమాజంలో రోజురోజుకు మానవ సంబంధాలు అంతరించుపోతున్న తరుణంలో ఎవరు లేని నిరుపేద ఆర్యవైశ్యురాలు వేముల అనసూర్యమ్మ శవానికి దహన సంస్కారాలు, దశదిన కర్మ చేసిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే. మహబూబాబాద్ పట్టణంలోనిరుపేద ఆర్యవైశ్య మహిళ వేముల అనసూర్యమ్మకు ఆర్యవైశ్య సంఘం అండగా నిలిచింది. వృద్ధాప్యంలో ఉండి ఏ పని చేయలేని స్థితిలో ఉన్న ఆమెకు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తల కొంత వేసుకుని గత రెండు సంవత్సరాలుగా ప్రతినెల నిత్యావసర సరుకులు అందించి ఆకలితీర్చారు. అనారోగ్యంతో ఫిబ్రవరి 25న అనసూర్యమ్మ కన్నుమూయడంతో ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు. అంతటితో తమ పని అయిపోయింది అని వదిలేయకుండా బుధవారం దశ దినకర్మ సందర్భంగా పట్టణంలోని పత్తిపాకరోడ్‌లో 400మందికి అన్నదానం చేశారు. కాగా, ఆర్యవైశ్య సంఘం చేసిన మంచి పనిని ప్రజలు అభినందిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనర్సింహారావు, మండల అధ్యక్షుడు బోనగిరి గిరిధర్‌గుప్తా, అమవాస్యఅన్నదానకమిటీ చైర్మన్ జంగాల సదాశివుడు, జంగాల వెంకట్, సోమ శ్రీనివాస్, బోనగిరి వేణు, బొడ్ల కామేష్, గోపు రాము, మాలె కిరణ్, వందనం కమల్, పెనుగొండ సదాశివుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

తొర్రూరు, మార్చి 6 : మునిసిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వెంటనే వేతన బకాయిలను చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ శాంతికుమార్‌కు కార్మికులతో కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలో పనిచేస్తున్న 93 మంది కార్మికులకు గత సంవత్సర కాలంగా వేతన బకాయిలు ఇవ్వడం లేదని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ వేతనాల్లో కట్ అయినా కార్మికుల ఖాతాల్లో జమ కావడం లేదని, ఈఎస్‌ఐ కార్డులులేక ఎంతోమంది కార్మికులు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటూ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీనెల 5వ తారీఖునే వేతనాలు అందించాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ప్రసాద్, వెంకన్న, యాకయ్య నవీన్, భిక్షపతి, మహేష్, రామస్వామి, నర్సమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి6 : సైబర్ నేరాలపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని మానుకోట డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. మహబూబాబాద్ శివారు ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో బుధవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ శరవయ్య, ఎస్సైలు దీపికారెడ్డి, రమేష్, బ్లూకోర్ట్ సిబ్బంది సంపత్, విజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మహిళా దినోత్సవం

మహబూబాబాద్ టౌన్, మార్చి 6 : మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో డీఎం ఎం.శివప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్బీఐ గుమ్మునూర్ బ్రాంచ్ మేనేజర్ నాగమణి, మహిళా ఉద్యోగులు కేక్ కట్ చేశారు. అనంతరం గత 15 సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సులో ప్రతి రోజు ప్రయాణిస్తున్న వాడపల్లి రమణమ్మ, వాడపల్లి మమత, ఎస్. రాధిక, స్వప్నలతో పాటు ఆర్టీసీ మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, మహాలక్ష్మిపథకంతో మహిళామణులు ఆర్టీసీ బస్సులకు చేరువయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు శ్యాం, వెంకన్న, పట్టాభి లక్ష్మయ్య, పాపిరెడ్డి, జగన్ పాల్గొన్నారు.


ములుగులో మంత్రి సీతక్కకు ఆహ్వానం అందజేస్తున్న పూజారులు

మంత్రికి ముసలమ్మ జాతర ఆహ్వానం

కొత్తగూడ, మార్చి 6 : మండలంలోని గుంజేడులో ఈనెల 20 నుంచి నిర్వహించనున్న శ్రీముసలమ్మ మహజాతర ఆహ్వాన శుభపత్రికను పంచాయతీరాజ్ శాఖ, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు ములుగులో శ్రీముసలమ్మ దేవత పూజారులు బుధవారం అందజేశారు. మహజాతరకు వచ్చి శ్రీముసలమ్మ దేవతను దర్శించుకోవాలని మంత్రి సీతక్కను పూజారులు కోరారు. కార్యక్రమంలో పూజారులు తోలెం వెంకటేశ్వర్లు, తోలెం వెంకన్న, తోలెం నవీన్ కుమార్, తోలెం అనంతరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పాల్గొన్నారు.

పూలే విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమరపు ఐలయ్య

పెద్దవంగర, మార్చి 6 : జిల్లా కేంద్రంలో ఈనెల 10న సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ, మహిళ సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమరపు ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ, మహిళ సదస్సుల కరప్రతాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శతాబ్దిన్నర కాలానికి ముందే విద్య అందరిదని నమ్మి విద్యను పంచడానికి ఎన్నో అవరోధాలు, దాడులను ఎదుర్కొన్న ధీర వనిత సావిత్రిబాయి పూలేనని కొనియాడారు. ఈ నెల 10న జిల్లా కేంద్రంలో సావిత్రి బాయి పూలే విగ్రహావిష్కరణ, మహిళ సదస్సుకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, వెంకటేశ్వర్లు, మురళి, శ్రీనివాస్, ప్రకాష్, నాగమణి, వెంకన్న, ఆంజయ్య, యాకుబ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

(3వ పేజీ తరువాయి)

చేరారని ఝాన్సీరెడ్డి వెల్లడించారు. మరి కొంతమంది కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మునిసిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వశమైందని, ఇది మాజీమంత్రి ఎర్రబెల్లికి ఎదురుదెబ్బ అన్నారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవడం ఖాయమని, అన్నిమండలాల నుంచి ముఖ్యకార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాయపర్తి, పాలకుర్తి మండలాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు కె.నిరంజన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, తిరుపతి రెడ్డి, నాయకులు సంతోష్, సోమరాజశేఖర్, రాము, పెదగాని సోమయ్య, అచ్చిరెడ్డి, హనుమాండ్ల నరేందర్‌రెడ్డి, వరప్రసాద్, కిషన్ యాదవ్, శ్రావణ్, అచ్చిరెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

వరంగల్‌టౌన్, మార్చి 6 : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి కె. సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మహాశివరాత్రి, శనివారం మహాశివరాత్రి మరుసటి రోజు జాగరణ, వారంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం నుంచి మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని కార్యదర్శి సంగయ్య ఆ ప్రకటనలో తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు


గూడూరులో వానరానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంపత్

గూడూరు, మార్చి 6 : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిసర ప్రాంతంలో విద్యుత్ పోల్‌పై విద్యుదాఘాతంతో మృతి చెందిన వానరానికి స్థానిక యువకుడు బి.సంపత్ హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. దీంతో స్థానికులు సంపత్‌ను అభినందించారు.

ముగిసిన మండల సర్వసభ్య సమావేశం


ఏపీవోను ప్రశ్నిస్తున్న ఎంపీపీ విజయ

కొత్తగూడ, మార్చి6 : మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు వారి వారి శాఖల పరిధిలో చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. మండల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, తహసిల్దారు రమాదేవి, ఎంపీటీసీ మోకాళ్ల సంతోషరాణి వెంకటేష్, హలావత్ సాలూకీ సురేష్, నునబోతుల స్వప్న లింగన్న యాదవ్, భైరబోయిన సదానందం, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్, అధికారులు పాల్గొన్నారు.